సాక్షి సంగారెడ్డి

శనివారం । 9 । నవంబర్ । 2024



డ్రోన్‌లతో ఇళ్ల సర్వే

అర్బన్ ల్యాండ్స్, గృహాలకు నక్ష ఉండేలా కేంద్రం చర్యలు తీసుకుంటుంది. పైలెట్ ప్రాజెక్టు కింద హుస్నాబాద్ మున్సిపాలిటీని ఎంపిక చేశారు. వివరాలు 8లో ▸



పాత కక్షలతోనే మహిళ హత్య

పాత కక్షలతోనే మహిళను ముగ్గురు వ్యక్తులు కలిసి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితులను రిమాండ్‌కు తరలించారు. వివరాలు 8లో ▸



మెట్రో కూత కూసేనా..!

పటాన్‌చెరు, రామచంద్రాపురం ప్రజలు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న మెట్రో రైలు కల త్వరలో సాకారం కానుంది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి

- డీఈఓ వెంకటేశ్వర్లు పిలుపు



వాసర్ పాఠశాలలో తనిఖీ చేస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

కల్హేర్(నారాయణఖేడ్): పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా విద్యాధికారి (డీఈఓ) ఎస్.వెంకటేశ్వర్లు సూచించారు. సిర్గాపూర్ మండలం వాసర్ ఉన్నత పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కొద్దిసేపు ముచ్చటించారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అంతకుముందు గ్రామంలో కుటుంబ సర్వేపై ఇంటింటా స్టిక్కర్లు వేసే కార్యక్రమన్ని ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంజులాదేవి, ఉపాధ్యాయులు రహీం, తుకరాం పాల్గొన్నారు.

సమయపాలనతో బస్సులు నడపాలి

- ఆర్‌ఎం ప్రభులత



సమీక్ష నిర్వహిస్తున్న ఆర్‌ఎం ప్రభులత

నారాయణఖేడ్: ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా బస్సు సర్వీసులను కచ్చితమైన సమయపాలనతో నడపాలని ఆర్టీసీ రీజినల్ మేనేజరు ప్రభులత సూచించారు. నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోను శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిపోలో బస్సులు నడుస్తున్న తీరు, ఆదాయం వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం ప్రభులత మాట్లాడుతూ...తీర్థయాత్రలు, అయ్యప్ప స్వాముల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. తీర్థయాత్రలకు వెళ్లే వారి కోసం డీలక్స్, సూపర్ డీలక్స్ బస్సులను నడపాలని సూచించారు. అరుణాచలంకు ఈ నెల 13న ప్రత్యేక బస్సు సర్వీసును నడపాలని డిపో మేనేజర్ మల్లేశయ్యకు సూచించారు. సమీక్షలో అసిస్టెంట్ డీఎం నర్సింహులు, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జ్ పాండు పాల్గొన్నారు.

సర్వేను సక్రమంగా నిర్వహించాలి

- జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి

కంది(సంగారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేను సక్రమంగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి సూచించారు. కందిలో నిర్వహిస్తున్న కులగణన సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సర్వే చేసేటప్పుడు ఎన్యూమరేటర్లు తప్పుల్లేకుండా నమోదు చేయాలన్నారు. సర్వే చేసిన ఇళ్లకు తప్పకుండా స్టిక్కర్ అంటించాలని చెప్పారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు, రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, సూపరింటెండ్ వేణుగోపాల్‌తోపాటు ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మునిపల్లి విద్యార్థిని

మునిపల్లి(అందోల్): ఎస్‌జీఎఫ్ అండర్ 14 ఫుట్‌బాల్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు మునిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని దివ్య ఎంపికైంది. మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థి డి.దివ్య శుక్రవారం మెదక్‌లో జిల్లాస్థాయి పోటీలలో పాల్గొని అద్భుత ప్రతిభను కనబరిచింది. దీంతో దివ్య రాష్ట్రస్థాయిలో నిర్వహించే అండర్ 14 ఫుట్‌బాల్‌లో ఆడేందుకు అవకాశం దక్కించుకున్నట్లు డీఈఓ రాధాకృష్ణ మీడియాకు తెలిపారు. మోడల్ స్కూల్ పీటీ మన్సూర్, విద్యార్థిని దివ్య పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని దివ్య

82,448 దరఖాస్తులు

ఉమ్మడి మెదక్ జిల్లాలో ముగిసిన ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ

- అత్యధికంగా పట్టభద్రులు
- ఆన్‌లైన్‌లోనే అధికం
- పెరగనున్న ఓటర్ల సంఖ్య

సంగారెడ్డి జోన్: ఎమ్మెల్సీ స్థానాలకు ఓటు వేసేందుకు ఉమ్మడి జిల్లాలో 71 మండలాల్లో 82,448 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులైన వారి నుంచి సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 6వ తేదీవరకు దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్ విధానంలో కూడా స్వీకరించారు. ఈ మేరకు ఆన్‌లైన్ విధానంలోనే అధిక దరఖాస్తులు వచ్చాయి.

8,139 మంది టీచర్లు దరఖాస్తు

ఆయా జిల్లాలలో 8,139 మంది ఉపాధ్యాయులు, 74,259 మంది పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సిద్దిపేటలో అత్యధికంగా 32,132 మంది పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులలో సైతం సిద్దిపేటలో అత్యధికంగా 3,612 మంది దరఖాస్తు చేసుకున్నారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం మరోసారి తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని ఆదేశాలు ఉండటంతో, ఓటు హక్కు ఉన్నవారు సైతం దరఖాస్తు చేసుకున్నారు. 2021 నాటికి డిగ్రీ పూర్తి చేసుకున్న వారు తమ ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఆసక్తి కనబరిచారు.

23న ముసాయిదా ఓటరు జాబితా

గడువులోపు దాఖలైన ఓటు హక్కు దరఖాస్తులను పరిశీలించి ఈనెల 23న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించనున్నారు. జాబితా విడుదల చేసిన నాటి నుంచి డిసెంబర్ 9 వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నారు.



జిల్లాల వారీగా ఓటు హక్కు నమోదు దరఖాస్తు వివరాలు		
జిలా	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
సంగారెడ్డి	28,238	3,134
మెదక్	13,889	1,443
సిద్దిపేట	32,132	3,612
మొత్తం	74,259	8,189

వచ్చే ఏడాది మార్చి 29న ముగియనున్న పదవీకాలం

నాలుగు జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గ స్థానంతోపాటు, పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రస్తుత ఎమ్మెల్సీ సభ్యుల కాలపరిమితి 2025 మార్చి 29 నాటితో ముగియనుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానాలకు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఎన్నికల కమిషన్ అర్హత కలిగిన ఓటర్ల నమోదు కోసం అవకాశం కల్పించింది.

సర్వే అధికారులకు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి
- సర్వే ప్రక్రియను పరిశీలించిన అధికారులు

సంగారెడ్డి జోన్: ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు సమగ్ర ఇంటింటి సర్వే ఎంతగానో దోహదపడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వేకు వచ్చిన అధికారులకు ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. విద్యానగర్‌కాలనీలో శుక్రవారం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియను ఆమె తనిఖీ చేశారు. ఆయా ఇళ్లను సందర్శించి కుటుంబ సర్వే నిర్వహణ కోసం అతికించిన స్టిక్కర్లను చూసి, వాటిపై నమోదు చేసిన ఇంటి నంబరు, ఎన్యూమరేషన్ బ్లాక్, క్రమ సంఖ్య తదితర వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...సర్వేలో ఏ ఒక్క కుటుంబాన్ని కూడా విడిచిపెట్టవద్దన్నారు. అన్ని కుటుంబాల వివరాలను సమగ్రంగా సేకరించాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. ఇంటి యజమాని ఇచ్చిన వివరాలను త్రమే ప్రొఫార్మాలో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, మెస్మా పి.డి. గీత, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ క్రాంతి తదితరులు

సమన్వయంతోనే నేరాల నియంత్రణ

సంగారెడ్డి జోన్: మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణ అన్ని శాఖల సమన్వయంతోనే సాధ్యమవుతుందని జిల్లా ఎస్పీ చెన్నూరి పేర్కొన్నారు. సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో యూనిసెఫ్, నల్సార్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పోక్సో నేరాలలో బాధితులకు అందించాల్సిన తక్షణ చర్యలపై వైద్యాధికారులు, ఎస్‌హెచ్‌ఓ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. మైనర్ బాలికలపై జరుగుతున్న పోక్సో నేరాలలో బాధితులకు అందించే సేవల అమలులో పోలీసు శాఖ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బాలకృష్ణ మాట్లాడుతూ...అన్ని శాఖలు సమన్వయంతో పని చేసినప్పుడే బాధితులకు సత్వరన్యాయం చేయగలమన్నారు. ఒక పోక్సో కేసును నిర్ధారించడానికి విద్యాశాఖ ఇచ్చే బోర్న్ ఆఫ్ ఐడీ చాలా కీలకమని, అదేవిధంగా ఎలాంటి సమయంలోనైనా స్పందించి, వైద్య పరీక్షలకు వైద్య శాఖ, బాధితులకు ఆశ్రయం కల్పించేందుకు శిశు సంక్షేమ శాఖ ఇలా వివిధ శాఖలు సమన్వయంతో కలసి పనిచేసినప్పుడే బాధితులకు సత్వరన్యాయం చేయగలుగుతామని వివరించారు. యూనిసెఫ్ ప్రతినిధి డేవిడ్ రాజు మాట్లాడుతూ..18 ఏళ్లు నిండనివారందరూ బాలలుగానే పరిగణనలోకి వస్తారన్నారు. అలాంటివారు నేరం చేసినట్లయితే వారిని సీసీఎల్‌గా పేర్కొవచ్చన్నారు. కార్యక్రమంలో ఫోరెన్సిక్ లేబోరేటరి విభాగం అధికారి డా.సుధా, వైద్య కళాశాల ప్రొఫెసర్లు, జిల్లా పోలీసు అధికారులు, డీజీపీఓ రత్నం, సీడబ్ల్యూసీ ఇన్‌చార్జ్ విష్ణుమూర్తి, డీఎస్పీలు సత్తయ్యగౌడ్, వెంకట్ రెడ్డి, రవీందర్ రెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

- జెడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న

హత్నూర(సంగారెడ్డి): గర్భిణీలకు, బాలింతలకు ప్రభుత్వం ద్వారా అందజేసే పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో సక్రమంగా అందించాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న స్పష్టం చేశారు. హత్నూర మండలం కోనంపేట, కొత్తగూడెం, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణీలు బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల శారీరక దృఢత్వంతోపాటు పిల్లల్లో ఎదుగుదల ఉంటుందన్నారు. చింతలచెరువు, రెడ్డిపాలెం గ్రామాలలో కొనసాగుతున్న ఇంటింటి సర్వేను అదేవిధంగా చింతలచెరువులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సైతం సీఈవో స్వప్న పరిశీలించారు. ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీవో శంకర్ తదితరులున్నారు.

పొగాకు రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

- జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి

పటాన్‌చెరుటౌన్: రాష్ట్రంలోని గ్రామాలను పొగాకు రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదామని జిల్లా పొగాకు నియంత్రణాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బీరంగూడ కమాన్ వద్ద శుక్రవారం పొగాకు వినియోగం- దుష్ప్రభావాలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ...నేటి యువత పొగాకును విచ్చలవిడిగా వాడుతున్నారన్నారు. పొగాకు వినియోగం వల్ల చిన్న వయసులోనే వివిధ రకాల కేన్సర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక బాధ్యతగా యువతను పొగాకు వినియోగానికి దూరంగా ఉంచేలా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.



శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నారాయణఖేడ్‌లోని తన నివాసంలో పార్టీ శ్రేణులతో కలిసి కేక్‌ను కట్ చేస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్.
– నారాయణఖేడ్

చెరుకు రైతులకు పూర్వ వైభవం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- మాటూర్‌లో చక్కెర ఫ్యాక్టరీ, నాగ్వార్‌లో సీసీఐ కేంద్రం ప్రారంభం

రాయికోడ్(అందోల్): చెరుకు రైతులకు పూర్వ వైభవం వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మాటూర్ శివారులో 'గోదావరి- గంగా'ఆగ్రో ప్రోడక్ట్ ప్రైవేటు లిమిటెడ్ చక్కెర ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ...గత పదేళ్లలో ప్రభుత్వం ఒక్క చక్కెర కర్మాగారాన్ని కూడా ఏర్పాటు చేయలేదన్నారు. రాష్ట్రంలో 12 చక్కెర కర్మాగారాలుంటే అందులో 6 మాత్రమే పని చేస్తున్నాయని తెలిపారు. మాటూర్‌లో చక్కెర కర్మాగారాన్ని కేవలం పది నెలల్లోనే ప్రారంభించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం తరఫున కర్మాగారానికి కావల్సిన సహాయ సహకారాన్ని అందించి రైతుల ప్రయోజనాలను కాపాడుతామని చెప్పారు. కొత్తగా ఏర్పాటైన ఈ చక్కెర కర్మాగారం వల్ల ప్రత్యక్షంగా 300 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. ఫ్యాక్టరీలో 4 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ సామర్థ్యముందని తద్వారా రాయికోడ్, మునిపల్లి, రేగోడ్, నారాయణఖేడ్, జహీరాబాద్, శంకరంపేట ప్రాంతాల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వెల్లడించారు.

కాగా, చెరుకు మద్దతు ధరపై ఓ రైతు ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని నిలదీయగా మంత్రి దామోదర సదరు రైతుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకు ముందు నాగ్వార్ శివారులోని పత్తి మిల్లులో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు నాణ్యమైన పత్తిని సీసీఐ కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను పొందాలని సూచించారు. సీసీఐకి వ్యవసాయ, మార్కెట్ రవాణ శాఖల నుంచి తగిన సహకారం అందుతుందన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల నాగారం అంజయ్య, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్, ఏడీఏ సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో సూర్య భగవాన్ ఆలయం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన
- త్వరలో 1.5 కోట్ల రూపాయలతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం

పటాన్‌చెరు: నియోజకవర్గంలోని ఉత్తర భారతీయుల సంక్షేమానికి, వారి అర్థికాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు సాకి చెరువు కట్టపైన రూ.2 కోట్ల సొంత నిధులతో సూర్య భగవాన్ దేవాలయం నిర్మాణానికి శంకుస్థాపన శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఉత్తర భారతీయులు సూర్యభగవానుడిని ఆరాధిస్తూ నిర్వహించే ఛట్ పూజ ఉపవాస దీక్షల ముగింపు సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని సాకి చెరువు కట్టపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కార్పొరేటర్ నీతి కుమార్‌యాదవ్‌తో కలసి ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాణ్యమైన సేవలకు చిరునామా ఏరియా ఆసుపత్రి

ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరొందిన పటాన్‌చెరు పట్టణంలోని టంగుటూరి అంజయ్య ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నాణ్యమైన సేవలకు చిరునామాగా నిలుస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆసుపత్రిని అత్యాధునిక సౌకర్యాలతో ఆధునీకరించడంతోపాటు, రోగులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇటీవల కేంద్ర ఆరోగ్య శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి నాణ్యమైన సేవల విభాగంలో జాతీయస్థాయిలో ఏడవ స్థానం లభించడం పట్ల ఆసుపత్రి వైద్యులను సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....త్వరలో 1.5 కోట్ల రూపాయలతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం చేపడతామన్నారు. అవార్డు రావడంలో భాగస్వామ్యులైన ప్రతీ ఒక్కరిని సన్మానించనున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో అన్ని విభాగాల్లో 24 గంటలపాటు వైద్య సేవలు అందించడంతోపాటు, అన్ని రకాల ల్యాబ్ టెస్టులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న పలు సమస్యలను సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వీటితో పాటు అతి త్వరలో మరో అంబులెన్స్ కొనుగోలుకు నిధులు కేటాయిస్తానని తెలిపారు.



సాకి చెరువు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

కాంట్రాక్టర్‌పై ఆగ్రహం

ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని విభాగాలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. ఆస్పత్రి ప్రాంగణంతోపాటు చుట్టుపక్కల శానిటేషన్ సరిగా చేయడం లేదని సంబంధిత కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్‌ఎంవో, వైద్యులు, సలహా సంఘం కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ అధికారి సంగారెడ్డి, ఆస్పత్రి సూపరింటెంట్ శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఎంవో ప్రవీణ, కమిటీ సభ్యులు గాయత్రి పాండు, కంకర శీనయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

గురుకులంలో ఆటకు వేళాయె

- రేపటినుంచి 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్
- నాలుగు రోజులపాటు ఆటల పోటీలు
- ఇప్పటికే చేరుకున్న క్రీడాకారులు
- అందోల్‌లో ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి దామోదర రాజనర్సింహా

నారాయణఖేడ్: సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థుల టెన్త్ జోనల్ లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్, 6వ జోన్ క్రీడాపోటీలకు గురుకులాల విద్యాసంస్థ సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి అన్ని జోన్‌లలో ఈ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారు. 6వ జోన్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్‌లో బాలురు, అందోల్‌లో బాలికల విభాగంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈనెల 10 న ప్రారంభమయ్యే క్రీడాపోటీలు 14వ తేదీతో ముగిస్తాయి. దీంతో ఆయా గురుకులాల్లోని విద్యార్థులు ఈనెల 9వ తేదీ నుంచి 15వ తేదీవరకు సెలవులను ప్రకటించారు. అందోల్‌లో క్రీడాపోటీల ఏర్పాట్లను మంత్రి దామోదర రాజనర్సింహ పర్యవేక్షించారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తూ క్రీడాపోటీలు నిర్వహించాలని సూచించారు.

ఖేడ్‌లో బాలురు.. అందోల్‌లో బాలికలు..

నారాయణఖేడ్‌లో బాలురకు, ఆందోల్‌లో బాలికల విభాగాల్లో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. 5, 6, 7వ తరగతులకు సంబంధించి అండర్ 14విభాగం విద్యార్థులు, 8, 9, 10వ తరగతి విద్యార్థులు అండర్ 17, ఇంటర్మీయెట్ విద్యార్థులు అండర్ 19 విభాగంలో ఆటలు ఆడనున్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, బాల్ బాడ్మింటన్, టెన్నీకాయిట్, క్యారమ్స్, చెస్, అథ్లెటిక్స్, హైజంప్, లాంగ్ జంప్ తదితర క్రీడాపోటీలను నిర్వహించనున్నారు. అయితే ఫుట్‌బాల్ పోటీల నుంచి బాలికలను మాత్రం మినహాయించారు.

6వ జోన్ పరిధి క్రీడాకారులు హాజరు..

10వ జోనల్ స్పోర్ట్స్ మీట్ క్రీడాపోటీలకు 6వ జోన్ పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల క్రీడాకారులు హాజరు కానున్నారు. ఖేడ్‌లో నిర్వహించే బాలుర పోటీలకు నారాయణఖేడ్ నల్లవాగు, కొండాపూర్, దిగ్వాల్ (న్యాల్‌కల్), సింగూరు, హత్నూర పాఠశాల/ కళాశాల, శేఖ్‌పేట్, ఉప్పల్, మల్కాజిగిరి, శామీర్ పేట్ తదితర 11 పాఠశాలకు చెందిన 935మంది క్రీడాకారులు, అందోల్‌లో నిర్వహించే బాలికల క్రీడాపోటీలకు చిట్కుల్, ఇస్నాపూర్, జహీరాబాద్, అందోల్, రాయికోడ్ వికారాబాద్, కోకట్, మెమిన్‌పేట్, బంత్వారం, ఆర్.కె.పురం తదితర 10 గురుకుల పాఠశాలలకు చెందిన 850మంది క్రీడాకారులు పాల్గొనున్నారు. క్రీడాకారులు, పీఈటీలు, పీడీలు, ఇతర అధ్యాపకులు కలిపి సుమారు 1,200 మందికి భోజన, వసతి ఏర్పాట్లు చేపట్టారు. పోటీలను సజావుగా నిర్వహించేందుకు 12 కమిటీలను నియమించారు.



నారాయణఖేడ్‌లో క్రీడాపోటీలకు సిద్ధం చేసిన గ్రౌండ్

అన్ని సదుపాయాలు..



క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తున్నాం. అధ్యాపకులు, సిబ్బంది అందరం కలసి సమష్టిగా ఏర్పాట్లు చేపట్టాం.

– పి.లింగారెడ్డి, ప్రిన్సిపాల్, ఖేడ్ సాంఘిక సంక్షేమ గురుకులం

పోటీలకు ఏర్పాట్లు..



క్రీడాపోటీలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సాగుతున్నాయి. నారాయణఖేడ్‌లో బాలుర, అందోల్‌లో బాలికల విభాగంలో 6వ జోన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పోటీలు నిర్వహిస్తున్నాం.

– గణపతి, క్రీడాపోటీల ఇన్‌చార్జ్

క్లుప్తంగా

జూడో క్రీడలో గోల్డ్ మెడల్



సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థి దయాకర్

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి దయాకర్ ఓయూ ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్‌లో జూడో క్రీడలో 60 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ విశ్వనాథంతో పాటు అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ లభిస్తుందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

మెదక్‌జోన్(మెదక్): జిల్లా కేంద్రంలో అండర్–14 విభాగంలో నిర్వహించిన ఫుట్‌బాల్ క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.నాగరాజు శుక్రవారం తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలకు చెందిన క్రీడాకారులకు నిర్వహించిన ఈ పోటీల్లో 300 మంది పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేసి వనపర్తిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ రాధాకిషన్ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఫుట్‌బాలా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నవోదయ దరఖాస్తుల గడువు పొడిగింపు

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లా వర్గల్ నవోదయ విద్యాలయంలో 9వ, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ గడువు 19 వరకు పొడిగిస్తూ నవోదయ విద్యాలయ సమితి ఆదేశాలు జారీ చేసిందని ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రూ.15 లక్షలు దుర్వినియోగం

పంచాయతీ కార్యదర్శిపై డీపీఓ కార్యాలయంలో ఫిర్యాదు

సిద్దిపేటరూరల్: చట్ట విరుద్ధంగా ఇళ్ల మార్పిడి, వెంచర్లకు అనుమతులు ఇస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుడు కుంచం అశోక్ మాట్లాడుతూ.. అక్టోబర్ 9న కొండపాక మండల ఎంపీఓకు సమాచార హక్కు చట్టం ద్వారా అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రికార్డులు, ఎంబీబుక్‌లు, పన్ను వసూలు పరిశీలించానన్నారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి తప్పుడు తీర్మానాలతో పని చేయని వాటికి నిధులు ఖర్చు చేస్తూ, అవినీతి అక్రమాలను బయటికి రాకుండా ముందస్తుగా పాలకవర్గంతో తీర్మానాలు చేయించుకున్నాడన్నారు. పాలకవర్గం సభ్యులపై చెక్కులు డ్రా చేసి సుమారు రూ.15 లక్షల వరకు నిధులను దుర్వినియోగం చేశాడన్నారు. అలాగే ఇళ్ల మార్పిడి, గ్రామంలో అనుమతులు లేకుండా వెంచర్లకు పర్మిషన్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 2019 నుంచి 1,024 వరకు జరిగిన ప్రతీ పని, చెల్లింపుల వారీగా పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఓ వైపు టెక్నాలజీ.. మరో వైపు గ్రీనరీ



సంగారెడ్డి జిల్లాలోని ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్ ఆవరణమంతా ఎటు చూసినా పచ్చదనంతో దర్శనమిస్తోంది. రోడ్లకు ఇరువైపులా పచ్చని చెట్లతో కళకళలాడుతోంది. అలాగే, పర్యావరణ పరిరక్షణ చేస్తూ దట్టమైన చెట్లను పెంచుతున్నారు. మరో వైపు అధునాతన సాంకేతికను వినియోగిస్తూ ఆకాశాన్ని తాకే భవనాలు కడుతున్నారు. దీంతో ఐఐటీ విద్యార్థులకు, చుట్టు పక్కలవారికి ఆహ్లాదకరమైన వాతావరణం కనువిందు చేస్తోంది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



డ్రోన్‌లతో ఇళ్ల సర్వే

ప్రతీ ఇల్లు, భూములకు నక్షా

- ధరణి పాస్‌బుక్ మాదిరిగా ఇంటింటికీ డిజిటల్ కార్డు
- ఇందులోనే సమగ్ర వివరాలు
- పైలెట్ ప్రాజెక్టుగా హుస్నాబాద్ మున్సిపాలిటీ



హుస్నాబాద్ పట్టణం

ప్రతీ ఇంటికి నక్షా.. ధరణి పాస్‌బుక్ మాదిరిగా ఒక డిజిటల్ కార్డు. ప్రతీ ఇల్లు, ఇంటి అడుగు విస్తీర్ణాన్ని తెలుపుతుంది. అర్బన్ ల్యాండ్స్, గృహాలకు నక్షా ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పైలెట్ ప్రాజెక్టు కింద దేశ వ్యాప్తంగా సుమారు వంద పట్టణాలను ఎంపిక చేశారు. రాష్ట్రం నుంచి 8 మున్సిపాలిటీలను ఎంపికయ్యాయి. సిద్దిపేట జిల్లా నుంచి హుస్నాబాద్ మున్సిపాలిటీని ఎంపిక చేశారు.

హుస్నాబాద్: నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బెస్ట్ ల్యాండ్ సర్వే ఆఫ్ హ్యాబిటేషన్స్ (ఎన్‌ఏకేఎస్ హెచ్‌ఏ–నక్షా) పథకం కింద సర్వే ఆఫ్ ఇండియా.. మున్సిపాలిటీ, ఇంటి, భూమి కొలతలు, ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాల నిర్వహణ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా హుస్నాబాద్‌లో చేపట్టనున్నాయి. ప్రైవేట్ సంస్థ భాగస్వామ్యంతో సర్వే ఆఫ్ ఇండియా పట్టణంలో శాటిలైట్ ద్వారా డ్రోన్ల సహాయంతో ఇంటి ఛాయాచిత్రాలు తీయనున్నారు. వీటి పరిశీలన పూర్తి చేసి క్షేత్రస్థాయిలో సర్వే చేయనున్నారు. ఇంటి సభ్యుల వివరాలు, గృహ విస్తీర్ణం ఇలా మొత్తం ఆస్తిని పక్కాగా సర్వే చేసి హద్దులను గుర్తిస్తారు. ధరణి పాస్‌బుక్ మాదిరిగా ప్రతీ ఇంటికి డిజిటల్ కార్డులు జారీ చేస్తారు. పేరు మార్పిడి, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, ఎవరికి ఎంత ఆస్తి ఉందో ఇట్టె తెలిసేలా ఇందులో ఇంటి యాజమాని సమగ్ర వివరాలు నమోదై ఉంటాయి.

విధి విధానాలు ఖరారు కాలేదు



ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ స్థాయి సదస్సులో అమెరికా, కొరియా, యూకే వంటి దేశాలకు చెందిన ప్రతినిధులు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్నా. అక్కడి దేశాల్లో చేపట్టే సర్వే, రీ సర్వే గురించి తెలిపారు. పలు దేశాలతో పాటుగా మధ్యప్రదేశ్, అస్సాం లాంటి రాష్ట్రాల్లో సైతం డ్రోన్ల సహాయంతో ఇంటి సమగ్ర సర్వే చేసినట్లుగా తెలుసుకున్నాం. హుస్నాబాద్‌లో నక్షా రూపొందించేందుకు ప్రభుత్వం నుంచి విధి విధానాలు రాలేదు.

–మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్

ఆస్తి పన్ను ఎగ్గొట్టే చాన్స్ ఉండదు

సాధారణంగా పట్టణ ప్రాంతంలో ఒక్క ఫ్లోర్‌కు ఇంటి అనుమతి తీసుకొని, పైన అనధికారికంగా మరో రెండు, మూడు ఫ్లోర్లు వేస్తూ, ఒక్క దానికే ఆస్తి పన్ను కడుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో మున్సిపల్‌కు ఆదాయం గండిపడుతుంది. డ్రోన్ల సహాయంతో నిర్వహించే సర్వేతో ఇంటి నక్షాను పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్ చేస్తారు. సర్వే తర్వాత ఆదాయం రెట్టింపు అయ్యే అవకాశం ఉంటుంది. పన్ను వసూళ్లలో సిబ్బందికి చిక్కులు తొలగనున్నాయి. ప్రభుత్వ భూములను గుర్తించి వాటికి హద్దులు నిర్ణయించడంతో ఆక్రమణలకు అడ్డుకట్ట పడనుంది. ఏటా హుస్నాబాద్ మున్సిపల్‌కు పన్నుల రూపంలో సుమారు రూ.1.10 కోట్లు ఆదాయం వస్తుంది.

హైనా దాడిలో 40 గొర్రెలు మృతి

రూ.3 లక్షల వరకు నష్టం



మృత్యువాత పడిన గొర్రెలు

చిన్నకోడూరు(సిద్దిపేట): హైనా దాడిలో గొర్రెలు మృతి చెందిన ఘటన చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామంలో గురువారం అర్ధరాత్రి రాత్రి చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. గ్రామానికి చెందిన మీసం మల్లయ్య రోజువారీగా గురువారం గొర్రెల మందను అడవిలో మేపుకొని వచ్చి సాయంత్రం వ్యవసాయ క్షేత్రం వద్ద కొట్టంలో తోలి ఇంటికెళ్లాడు. శుక్రవారం ఉదయం కొట్టం వద్దకు వచ్చి చూడగా గొర్రెలు మృత్యువాత పడి ఉన్నాయి. విషయం తెలుసుకున్న అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ బుచ్చయ్య, బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గొర్రెలపై హైనా దాడి చేసి ఉండొచ్చని నిర్ధారించారు. సుమారు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, మాజీ సర్పంచ్ బాబు, నాయకులు రాజిరెడ్డి, ఎల్లయ్య బాధిత రైతును పరామర్శించి, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు.

విద్యార్థిని ఢీకొట్టిన కారు

కళాశాలకు వెళ్లడానికి బస్టాండ్‌లో నిలబడగా ప్రమాదం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

హవేళిఘణాపూర్(మెదక్):కళాశాలకు వెళ్తున్న విద్యార్థిని కారు ఢీకొట్టగా తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మెదక్ మండల పరిధిలోని మాచవరం గ్రామానికి చెందిన ఉగ్గి శేఖమ్మ కుమారుడు సాయిబాబ మెదక్ పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం 8 గంటలకు కళాశాలకు వెళ్లేందుకు మాచవరం గేటు సమీపంలోని మెదక్– నర్సాపూర్ జాతీయ రహదారి పక్కన బస్టాండ్ వద్ద బస్సు కోసం నిల్చున్నాడు. ఈ క్రమంలో మెదక్ నుంచి నర్సాపూర్ వెళ్తున్న కారు అదుపుతప్పి విద్యార్థిని ఢీకొట్టి, అనంతరం పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. ఈ ప్రమాదంలో విద్యార్థికి కాలు విరిగి తీవ్ర గాయాలు కాగా స్థానికులు మెదక్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ పారిపోయాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఏఎస్‌ఐ వెంకటయ్య తెలిపారు.

బస్సు ఢీకొని యువకుడు మృతి

మరో యువకుడికి తీవ్ర గాయాలు

సదాశివపేట(సంగారెడ్డి): ట్రావెల్స్ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ మహేశ్‌గౌడ్ కథనం మేరకు.. మండల పరిధిలోని వెల్టూర్ గ్రామానికి చెందిన మల్లేపల్లి అరవింద్(30) అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడు గడ్డమీది అనిల్‌కుమార్‌తో కలిసి బైక్‌పై సదాశివపేట పట్టణానికి వస్తున్నారు. నిజాంపూర్ కూడలి వద్ద రోడ్డు దాటుతుంగా హైదరాబాద్ వైపు నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరవింద్ అక్కడికక్కడే మృతి చెందగా, అనిల్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మృతుడు తండ్రి మల్లేపల్లి మల్లేశం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డీసీఎం ఢీకొని కూలీ..



కిష్టయ్య(ఫైల్)

వట్‌పల్లి(అందోల్): డీసీఎం ఢీకొని కూలీ మృతి చెందిన ఘటన అందోలు మండల పరిధిలోని అల్మాయిపేట శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. జోగిపేట ఎస్‌ఐ పాండు కథనం మేరకు.. సంగారెడ్డి వైపు వెళ్లే రహదారి డివైడర్ మధ్యలో పెరిగిన పిచ్చి మొక్కలను అందోలు మండలం నాదులాపూర్ గ్రామానికి చెందిన తలారి కిష్టయ్య (50) తొలగిస్తున్నాడు. ఇదే సమయంలో పిట్లం నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న డీసీఎం కూలీపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కిష్టయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కర్నూలు ప్రాంతానికి చెందిన డీసీఎం వాహనంగా గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అట్టహాసంగా హ్యాండ్‌బాల్ పోటీలు



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, తదితరులు

ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి



మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు

హుస్నాబాద్: స్థానిక మినీ స్టేడియంలో 68వ పాఠశాలల సమాఖ్య రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ క్రీడా పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. క్రీడా పతాకాన్ని ఎగురవేసి, జ్యోతిని వెలిగించి మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి 9 జిల్లాల నుంచి బాలురు 160, బాలికలు 160 మంది, 40 మంది కోచ్ మేనేజర్లు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు డే అండ్ నైట్‌లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డీఈఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో హుస్నాబాద్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడా స్ఫూర్తితో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి దేశాన్ని అగ్రగామిగా నిలపాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని క్రీడలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ కొంకట నళినిదేవి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ఎంఈఓ బండారి మనీల, రాష్ట్ర పరిశీలకులు శ్రీను, ఉస్మాన్ షేక్, పేటా జిల్లా అధ్యక్షుడు అశోక్, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ సౌందర్య,పీడీలు శ్రీనివాస్, జంగపల్లి వెంకటనర్సయ్య, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కడుపునొప్పి భరించలేక ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని కొల్కూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన మంగలి సురేశ్(36) మంగలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిన్నశంకరంపేటలో దొంగల హల్‌చల్


నగదు, బంగారం అపహరణ

చిన్నశంకరంపేట(మెదక్): తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసిన గుర్తు తెలియని దుండగులు చోరీలకు పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. ఖాజాపూర్ గ్రామానికి చెందిన కుంట రాజశేఖర్ గ్రామంలో సీసీఎస్ సెంటర్(మినీ బ్యాంక్) నడుపుతాడు. గురువారం రాత్రి తాళం వేసి ఇంటికెళ్లిన తర్వాత గుర్తు తెలియని దుండగులు తాళం పగులు రూ.30 వేల నగదును చోరీ చేశారు. అలాగే గ్రామానికి చెందిన కుర్మ బీరయ్య ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికెళ్లగా దొంగలు ఇంటి తాళాలు పగుల గొట్టి బీరువాలోని 15 గ్రాముల బంగారు ఆభరణాలు, 50 తులాల వెండి కడియాలు చోరీ చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

యువకుడు అదృశ్యం

తొగుట(దుబ్బాక): యువకుడు అదృశ్యమైన ఘటన మండలంలోని వెంకట్రావుపేటలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఈదుగల్ల మల్లయ్య రెండో కుమారుడు కుమార్ (28) రెండు నెలల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. బంధువుల వద్ద వెతికినా ఆయన జాడ తెలియరాలేదు. శుక్రవారం తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఎండు గంజాయి పట్టివేత



నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

జహీరాబాద్ టౌన్: అక్రమంగా తీసుకొస్తున్న ఎండు గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ గాంధీనాయక్ కథనం మేరకు.. జహీరాబాద్ పట్టణంలోని బైపాస్ రోడ్డులో పస్తాపూర్ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టాం. మోటారు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా అతడి వద్ద 1,345 కిలోల ఎండుగంజాయి లభించింది. నిందితుడు షేక్ రహమత్ అహ్మద్ మహారాష్ట్రకు చెందిన వాడుగా గుర్తించాం. పట్టణంలోని రహమత్‌నగర్‌లో నివాసం ఉంటూ కర్నాటక రాష్ట్రంలోని బీదర్ పట్టణంలో గంజాయి కొనుగోలు చేసి జహీరాబాద్ ప్రాంతంలో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఎండు గంజాయి, మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి జహీరాబాద్ టౌన్ పోలీసులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. తనిఖీలో ఎస్‌ఐ యాదయ్య, హెచ్‌సీ అలీం, సిబ్బంది మల్కయ్య, అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి చోరీలు

- ముగ్గురు నిందితుల అరెస్టు
- రూ.12.50 లక్షలు విలువ చేసే బంగారం స్వాధీనం



మాట్లాడుతున్న డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జహీరాబాద్ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మండలంలోని హోతి(బి)కి చెందిన ముస్తాక్ హుస్సేన్(31), గొల్ల సిరిగి మహేశ్(21), గాజుల పవన్‌రెడ్డి(24) ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడ్డారు. ఈజీగా మనీ సంపాదించేందుకు ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. చోరీ చేసిన డబ్బులతో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతున్నారు. 5న జహీరాబాద్ పట్టణంలో వెంకటేశ్వర కాలనీలో ఓ ఇంట్లో బీరువా తాళాలను పగుటగొట్టి బంగారు నగలు చోరీ చేశారు. మొగుడంపల్లి మండలంల గొటిగార్‌పల్లిలోని ఓ ఇంట్లో దొంగతనం చేశారు. శుక్రవారం జహీరాబాద్ పోలీసులు పస్తాపూర్ ప్రాంతంలో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. బైక్‌పై వెళ్తున్న ముగ్గురిని అనుమానం వచ్చి విచారించంగా ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి చోరీలు చేసింది తామేనని నిందితులు అంగీకరించారు. వారి నుంచి రూ. 12.50 లక్షల విలువ చేసే 16 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన జహీరాబాద్ టౌన్ సీఐ శివలింగం, ఎస్‌ఐ కాశీనాథ్, హెచ్‌సీ నర్సింలును డీఎస్పీ అభినందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు వారికి నగదు రివార్డు అందజేశారు.

పాత కక్షలతోనే మహిళ హత్య

- ప్రధాన నిందితురాలితోపాటు మరో ఇద్దరు రిమాండ్
- వివరాలు వెల్లడించిన సీఐ జాన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ జాన్‌రెడ్డి

నర్సాపూర్: పాత కక్షలతోనే మహిళను ముగ్గురు వ్యక్తులు కలిసి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. శుక్రవారం స్థానిక సీఐ జాన్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లారెడ్డిగూడ తండాకు చెందిన ఆంగోత్ శాంత(45) సెప్టెంబర్ 11న నర్సాపూర్‌లో కూరగాయలు అమ్మేందుకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భర్త అమ్రు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే తండాకు చెందిన సభావత్ అరుణపై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించగా హత్య విషయాలు వెలుగులోకి వచ్చాయి.

రూ.10 వేలు, వెండి కడియాలకు మాట్లాడుకొని..

ఎల్లారెడ్డిగూడ తండాకు చెందిన అరుణకు, ఆంగోత్ శాంతకు మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో శాంతను ఎలాగైనా చంపాలని అరుణ పథకం వేసి తనకు పరిచయం ఉన్న నర్సాపూర్ మండలంలోని కొండాపూర్‌కు చెందిన శ్రీను, వెంకటయ్యలను కలిసింది. శాంతను చంపితే రూ.10 వేలతోపాటు ఆమెపై ఉన్న వెండి కడియాలు ఇస్తానని మాట్లాడుకుంది. సెప్టెంబర్ 11న శాంత నర్సాపూర్‌లో కూరగాయలు అమ్మడానికి వచ్చిన విషయాన్ని అరుణ మిగిలిన ఇద్దరికి చెప్పింది. ముగ్గురూ మార్కెట్‌కు వచ్చిన శాంతని కల్లు దుకాణం వద్ద కలుసుకొని మాయమాటలు చెప్పి నల్లవల్లి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. తమతో తెచ్చుకున్న మద్యం తాగారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం ముగ్గురూ. శాంతను ఆమె చున్నీతో గొంతు నులిమి చంపారు. మృతురాలిపై వెండి కడియాలు అరుణ తీసుకొని శవాన్ని అక్కడే పారవేసి వచ్చినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో ముగ్గురు నిందితులు అరుణ, శ్రీను, వెంకటయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. హత్య కేసును ఛేదించడంలో తనతోపాటు ఎస్‌ఐ లింగం, ఇతర సిబ్బంది ఉపేందర్, శ్రీకాంత్, జోగయ్య, పోచయ్య పాల్గొన్నారని వివరించారు.